సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 21 । జనవరి । 2024



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం
ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరు సత్రంపాడుకు చెందిన కందుల శ్రీలక్ష్మి రూ.2,00,116ను విరాళంగా అందజేశారు.



ముగ్గురు దొంగల అరెస్టు
ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.16 లక్షల విలువైన బంగారం, వెండి, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



ప్రకృతి వ్యవసాయం భేష్
రైతు సాధికార సంస్థ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని తాము అనుసరిస్తామని బంగ్లాదేశ్ బృందం స్పష్టం చేసింది. 8లో ▸

న్యూస్‌రీల్

24న ఆకివీడులో సామాజిక బస్సు యాత్ర



స్థల పరిశీలన చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు: ఆకివీడు పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ వద్ద ఈనెల 24న సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. సభా ప్రాంగణ ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. సామాజిక సాధికార యాత్రను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉండటంతో సభా ప్రాంగణం, వేదిక తదితర వాటిని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. యాత్రలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మో షేన్‌రాజు, ఎంపీ నందిగం సురేష్, మంత్రులు వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, జోగి రమేష్, మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ రౌతు సూర్యప్రకాశరావు పాల్గొంటారన్నారు. జెడ్పీ టీసీ వేగేశ్న వెంకటరాజు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, అంబటి రమేష్, ఎండీ జెక్కీ, అందే రాజబాబు, ఎస్‌కే హుస్సేన్ ఉన్నారు.

ఎంటీఎస్ ఉద్యోగుల ఆనందోత్సాహం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: వయోపరిమితి దాటినా తమపై అపార కరుణ చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాము జీవితాంతం రుణపడి ఉంటామని 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉద్యోగులు అన్నారు. శనివారం తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉద్యోగులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీఎస్సీ 1998కి చెందిన 4,072 మందికి ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాల్లో ఆనందం నింపారని వారన్నారు. పదవీ విరమణ వయసు 62 ఏళ్లుగా చేయాలని, 12 నెలలు జీతాలు అందించి, పెన్షన్ సౌకర్యకం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎస్ ఉద్యోగులు పీ బెనర్జీ, పీఆర్పీ పతంజలి, ఆనందకుమారి, జోసఫ్ రాజు, హేమంత్‌కుమార్, ఎస్ విజయకుమార్, సాయిబాబా, ఉషారాణి, ఎన్ శ్రీనివాసరావు, అశ్విన్‌కుమార్, రఘుపతిరావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత



ఎ.వీరయ్య చౌదరి, ప్రజా రవాణాధికారి

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లావ్యాప్తంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు వచ్చేనెల 14 వరకు కొనసాగుతాయని జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.వీరయ్య చౌదరి అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, మరణాలు సంభవించకుండా చూడటం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రమాదాలు, డ్యామేజ్ రికార్డు ఉన్న డ్రైవర్లందరికీ కౌన్సిలింగ్ నిర్వహించడం, దూర ప్రాంత సర్వీసులు తిరిగే డ్రైవర్లకు సూచనలు ఇవ్వడం చేస్తామన్నారు. డ్రైవర్లకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు జరిగినది లేనిది నిర్ధారించుకోవడం, బ్రీత్ అనలైజర్స్‌తో పరీక్షించడం, బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు, బ్రేకులు, లైట్లు, వైపర్లు తదితర వాటిని కండీషన్‌లో పెట్టడం వంటివి చేస్తామన్నారు. విశ్రాంతి గదులను తనిఖీ చేసి సిబ్బందికి సౌకర్యాలు కల్పించడంతో పాటు రూట్‌మ్యాప్‌ల ద్వారా ప్రమాదాల జరిగే స్పాట్‌లను గుర్తించి తగిన సూచనలు అందిస్తామన్నారు. వచ్చేనెల 14న ప్రమాద రహిత డ్రైవర్లను సత్కరించి అవార్డులను ప్రదానం చేస్తామన్నారు.

బీసీలకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట

- ఏలూరు ఎంపీ టికెట్ కేటాయింపుపై హర్షం
- బీసీ సంఘాల ఆనందోత్సాహాలు
- గెలిపించి కానుకగా ఇస్తామంటూ ప్రతిన
- మంత్రులు, ఎమ్మెల్యేలకు సంఘీభావం



ఏలూరులో మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే ఆళ్ల నానికి సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో బీసీ వర్గాలకు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారంటూ బీసీ సంఘాల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అన్నింటా బీసీలకు గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తున్నారంటూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ టికెట్‌ను బీసీలకు కేటాయించడం ద్వారా మరో మారు బడుగులకు పెద్దపీట వేశారని అంటున్నారు. గత పాలకులు బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటే సీఎం జగన్ ఇందుకు భిన్నంగా రాజ్యాధికారం అందించే దిశగా పనిచేస్తున్నారని కొనియాడుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది బీసీలు ఉన్నారని జనాభాకు తగ్గట్టుగానే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వివిధ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం తో పాటు నిధులను కేటాయించారని, నామినేటెడ్ పదవులతో పాటు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ స్థానాల్లో బీసీలను ముందు వరుసలో కూర్చోబెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా సమష్టిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గెలుపు కోసం పనిచేస్తాయని చెబుతున్నారు.

చరిత్రలో తొలిసారిగా..
ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఎంపీ టికెట్‌ను బీసీలకు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని బీసీ సంఘాల నాయకులు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏలూరు ఎంపీ సీటుతో పాటు దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా అందిస్తామని అంటున్నారు. బీసీలకు పెద్దపీట వేస్తుండటంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీసీలకు అగ్రతాంబూలం



రాష్ట్రంలో బీసీలకు అన్నింటా అగ్రతాంబూలం ఇస్తున్న పార్టీ ఏదైనా ఉంది అంటే అది ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమే. మిగిలిన రాజకీయ పార్టీలు బీసీలను వాడుకుని వదిలేస్తున్నాయి. ఏలూరు ఎంపీ టికెట్‌ను బీసీలకు కేటాయించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– లక్కోజు రాజగోపాలాచారి, అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఏలూరు జిల్లా

చాలా సంతోషం



ఏలూరు ఎంపీ సీటును బీసీలకు కేటాయించడం చాలా సంతోషం. కొన్నేళ్లుగా ఏలూరు ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని రాజకీయ పార్టీలను కోరుతున్నాం. వైఎస్సార్‌సీపీ సీటును కేటాయించడం గొప్ప విషయం. వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా పనిచేస్తాం.

– కాత్రు బాలు, ఏపీ యాదవ యువ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏపీ రాష్ట్ర యువజన జేఏసీ కో–కన్వీనర్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



బీసీలకు రాజ్యాధికారం అందించే దిశగా పనిచేస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. గత పాలకులకు భిన్నంగా బీసీలను అక్కున చేర్చుకుంటున్నారు. రాష్ట్రంలోని బీసీలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారు. బీసీలకు అన్నింటా పెద్దపీట వేస్తున్నారు.

– కింజంగి రాజు, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు, ఏలూరు

ఎన్నడూ లేనివిధంగా..



ఎన్నడూ లేనివిధంగా బీసీలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యంగా బీసీల్లో అత్యధిక జనాభా ఉన్న యాదవులకు సీఎం జగన్ సముచిత స్థానం ఇస్తుండటం సంతోషం. ఏలూరు ఎంపీ సీటును అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా అందిస్తాం.

– చిదరబోయిన శ్రీనివాసరావు, అధ్యక్షుడు, అఖిల భారత యాదవ మహాసభ, ఏలూరు జిల్లా

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): పోలింగ్ స్టేషన్లలో అవసరమైన మౌలిక సదుపాయాలను నెలాఖరులోపు పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం మండలంలోని తుందుర్రు సచివాలయం, పట్టణంలో చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాల పోలింగు స్టేషన్లను ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లడానికి, రావడానికి వేర్వేరు ద్వారాలు లేదా ఒకటే పెద్ద ద్వారం ఉంటే పార్టిషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మరుగుదొడ్లను, దివ్యాంగులకు వీలుగా ర్యాంపులు సిద్ధం చేయాలన్నారు. లైటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అవసరమైన చోట హైమాస్ట్ లైట్లను వినియోగించాలన్నారు. పూర్తిస్థాయిలో ఫర్నిచర్ ఉండేలా చూసుకోవాలన్నారు. పాఠశాలల పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను డీఈఓ, పట్టణ ప్రాంతాల్లోని కమ్యూనిటీ హాల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, వ్యవసాయ, అసోసియేషన్ హాల్స్‌ను మున్సిపల్ కమిషనర్లు సిద్ధం చేయాలన్నారు. భీమవరం ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, తహసీల్దార్ వై.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎంపీపీ భర్తకు మెరుగైన వైద్యం

- విజయవాడ నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- తక్షణమే స్పందించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



విద్యాసాగర్‌ను విజయవాడలో ఆస్పత్రికి తరలిస్తున్న మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పోడూరు: పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సబ్బితి విద్యాసాగర్ విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గన్నవరం సమీపంలో ఆయన్ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన తల వెనుక బలమైన గాయమైంది. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందేలా డాక్టర్లను ఆదేశించి దగ్గరుండి పర్యవేక్షించారు. మెరుగైన వైద్యం కోసం శనివారం ఆయన్ను విజయవాడలో అను న్యూరో అండ్ కార్డియాక్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సీఎం జగన్ దృష్టికి.. విద్యాసాగర్ ప్రమాద వార్తను ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఫోన్‌లో సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సీఎం జగన్ అడిగి తెలుసుకున్నారు. విద్యాసాగర్‌కు మెరుగైన వైద్యం అందేలా చూడాలనీ సీఎం జగన్ సూచించారు. పోడూరు మండల జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీడీఓ డి.సుహాసిని, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు విజయవాడ వెళ్లి విద్యాసాగర్‌ను పరామర్శించారు.

రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ అవసరం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



దండగర్రలో పాదయాత్ర చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ సీఎం జగన్ అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని దండగర్ర గ్రామంలో సకల జన సమ్మేళన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్ని నమ్మించి గొంతుకోసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. పవన్ పార్టీ పరంగా ముందుకెళితే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు, అయితే తనకున్న ఇమేజ్‌కు వెలకట్టి చంద్రబాబుతో లాలూచీ కుదుర్చుకొని ప్యాకేజీలకు అమ్ముడుపోయాడని, ఈ విషయాలపై ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. అవినీతి చేసి జైలుకెళ్లిన చంద్రబాబు కాళ్లను పవన్‌కల్యాణ్ మొక్కితే జనసేన శ్రేణులు సమర్థించుకోవచ్చు గాని సామాజికవర్గం ఎలా ఒప్పుకుంటుందన్నారు. ఇది చాలా దుర్మార్గమన్నారు. తాడేపల్లిగూడెం సీటు కోసం ఒకరిపై ఒకరు వ్యంగ్యాస్త్రాలు సంధించుకుంటున్నారని విమర్శించారు. గత టీడీపీ హయాంలో నీరు–చెట్టు పేరుతో కోట్లాది రూపాయలు దోచేశారని ఆరోపించారు. పవన్‌కు ఓటేస్తే చంద్రబాబుకు వెళ్తుందని గుర్తించాలన్నారు. త్వరలోనే పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రానున్నాయని, గ్రామంలో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి మంజూరు చేశామని, ఈ నెలలోనే పనులు ప్రారంభించే దిశగా ముందుకెళ్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎంపీటీసీ నార్ని శంకరరావు, మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణకుమారి, సొసైటీ చైర్మన్లు చిక్కాల సత్యనారాయణ, వెలిశెట్టి నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత
గ్రామానికి చెందిన వాకాటి శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందగా అతడి కుటుంబానికి రూ.లక్ష వైఎస్సార్ బీమా చెక్కును మంత్రి కొట్టు సత్యనారాయణ అందజేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు



టీడీపీ శ్రేణులను పార్టీలో చేర్చుకుంటున్న ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ముసునూరు: జగనన్న నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారు పార్టీ అభివృద్ధి, పురోగతి కోసం క్రమశిక్షణతో పని చేయాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. రమణక్కపేట గ్రామంలోని 12 కుటుంబాలకు చెందిన 48 మంది టీడీపీ గ్రామ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ టీడీపీ గ్రామ కార్యదర్శి పాలడుగు సుబ్బాచారి, ఆముదాల మరియన్న, పుష్పలత, నందిపాము రాణి, దారా బేబిషాలిని తదితరులకు ఎంపీ, ఎమ్మెల్యే కండువాలు వేసి ఆహ్వానించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, మాజీ ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ రంగు ధనలక్ష్మీ గాంధీ, ఉప సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లోనూ టికెట్ల విక్రయం



నిత్య ఆర్జిత కల్యాణం టికెట్ అందిస్తున్న సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో ఆఫ్‌లైన్‌లో శ్రీవారి నిత్యార్జిత కల్యాణం, అష్టోత్తర సేవా టికెట్ల విక్రయాలను శనివారం ప్రారంభించారు. ఆలయంలో ఇటీవల అన్ని సేవలతో పాటు నిత్యార్జిత కల్యాణం, అష్టోత్తర సేవా టికెట్ల విక్రయాలను ఆన్‌లైన్‌కు పరిమితం చేశారు. ఈ క్రమంలో నిత్య కల్యాణ మండపం వద్ద ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందేందుకు కియోస్క్ మెషీన్లను ఏర్పాటుచేశాయి. అయితే కొందరు భక్తులకు ఆన్‌లైన్ వినియోగంపై అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారు. దీనిని గుర్తించిన అధికారులు ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలను ప్రారంభించారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందడంపై అవగాహన కల్పించేలా బోర్డు ఏర్పాటుచేశారు.

నేడు ఏడీజే కోర్టు ప్రారంభం

తాడేపల్లిగూడెం: న్యాయసేవలు తాడేపల్లిగూడెం ప్రాంత ప్రజలకు మరింత చేరువ కానున్నాయి. జిల్లాలో కొత్తగా ఏడీజే కోర్టు ఆదివారం ఇక్కడ ప్రారంభం కానుంది. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 11వ ఏడీజే కోర్టుగా తాడేపల్లిగూడెంలో కోర్టును మంజూరు చేసింది. ఈ కోర్టు ఏర్పాటుతో ఎంటీఓపీ కేసులు, 302 ట్రయల్ కేసులు ఇక్కడే చేసుకోవచ్చు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఉన్న అపీల్స్ ఏడీజే కోర్టుకు వెళతాయని చెబుతున్నారు. తాడేపల్లిగూడెంకు సంబంధించి ఏలూరు జిల్లా కోర్టులో ప్రస్తుతం ఉన్న సుమారు 800 కేసులతో 200 కేసులు కొత్తగా ఏర్పాటుకాబోయే ఏడీజే కోర్టుకు బదిలీకానున్నాయని సమాచారం. రానున్న కాలంలో గూడెం సమీపంలోని కొన్ని ప్రాంతాలను ఈ కోర్టు పరిధిలోకి తీసుకొచ్చే అవకాశాలున్నాయి. తణుకు ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఈ కోర్టుకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్, హైకోర్టు జడ్జిలు ఏవీ శేషసాయి, నయనాల జయసూర్య, బీఎస్ భానుమతి, సత్తి సుబ్బారెడ్డి, వి.గోపాలకృష్ణారావు ఆదివారం కోర్టు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు.

సెల్ టవర్‌పై కొనసాగిన నిరసన

భీమవరం: బ్యాంకు నుంచి తన తండ్రి బీమా పత్రాలు ఇప్పించాలంటూ సెల్ టవర్ ఎక్కిన లోకం ఏసు నిరసన శనివారం మూడో రోజు కొనసాగింది. భీమవరం టూటౌన్ పరిధిలోని సెల్ టవర్ ఎక్కిన ఏసు తన తండ్రి ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బీమా పత్రాల కోసం బ్యాంకులో సంప్రదించగా సరైన సమాధానం చెప్పడం లేదంటూ నిరసన వ్యక్తం చేస్తున్నాడు. ఏసును సెల్ టవర్ నుంచి కిందకు దింపడానికి పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖాధికారులు ప్రయత్నిస్తున్నా ఫలితం లేదు. గురువారం నుంచి ఏకధాటిగా టవర్ పైనే కూర్చుని నిరసన తెలుపుతున్నాడు.

నవోదయ పరీక్షలకు 3,725 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాల నిమిత్తం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 3,725 మంది హాజరయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈ పరీక్ష నిమిత్తం 24 కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో 5,366 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,641 మంది గైర్హాజరయ్యారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం భేష్



మాట్లాడుతున్న బంగ్లాదేశ్ బృందం

చాట్రాయి: రైతు సాధికార సంస్థ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని తాము అనుసరిస్తామని బంగ్లాదేశ్ పల్లికర్మ సహాయ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ అకోండ్ మహ్మద్ రఫీకుల్ ఇస్లాం స్పష్టం చేశారు. శనివారం జనార్దనవరంలో వ్యవసాయ హెల్త్ క్లబ్ కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం, ఆహార భద్రత, మహిళా రైతు సాధికారత ప్రపంచానికే ఆదర్శకంగా నిలుస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం అమలులో ప్రధాన పాత్ర పోషిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు భవిష్యత్ ప్రణాళిక కూడా అద్భుతమని కొనియాడారు. మహిళా రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రసాయనాలు లేకుండా పండించిన పంటలతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నామని ఆదాయాన్ని పెంపొందించుకుంటున్నామని గ్రామ కమిటీ సభ్యులు బంగ్లాదేశ్ బృందానికి వివరించారు. మిచాంగ్ తుపాను తాకిడికి ఈ పంటలు తట్టుకున్నాయని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ బృందానికి వివరించారు. ప్రకృతి వ్యవసాయ పంటల ఛాయా చిత్రాలను బృందం తిలకించింది. మాజీ సర్పంచ్ పామర్తి నాగేశ్వరరావు, బంగ్లాదేశ్ బృందం సభ్యులు తాఫిక్ హుస్సేన్, సంసాద్ ఫర్జానా, రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్‌లు అరుణ, శ్రీరాము ఏలూరి, సురేష్, ఆరోగ్య విభాగం పీడీ డాక్టర్ రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి మనోహరాచారి



స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు

- 19 కేసుల్లో నిందితులుగా గుర్తింపు
- 30 కాసుల బంగారం, 3 కేజీల వెండి స్వాధీనం
- డీఎస్పీ రవి మనోహరాచారి పాలకొల్లులో వివరాలు వెల్లడి

పాలకొల్లు సెంట్రల్: పట్టణ శివారులో వాహనాల తనిఖీ సందర్భంగా పోలీసులను చూసి పారిపోతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.16 లక్షల విలువైన బంగారం, వెండి, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు నరసాపురం డీఎస్పీ కె.రవి మనోహరాచారి చెప్పారు. పట్టణ పోలీస్‌స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. శుక్రవారం పాలకొల్లు, భీమవరం రోడ్డు పూలపల్లి వై.జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా ఒక వాహనంపై ముగ్గురు వ్యక్తులు వస్తూ పోలీసులను చూసి వెనక్కి పారిపోతుండగా పట్టణ ఎస్సైలు ఎస్.ముత్యాలరావు, బి.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వారిని పట్టుకుని విచారణ చేశారు. ఈ విచారణలో పూలపల్లి ఎస్.టర్నింగ్ వద్ద ఉన్న హోటల్‌లో దొంగతనం చేశామని, అలాగే జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ఇళ్లల్లో దొంగతనాలు, మోటర్ సైకిల్ దొంగిలించినట్లు తేలిందన్నారు. దొంగిలించిన బంగారం, వెండి భీమవరంలో విక్రయించడానికి తీసుకువెళుతున్నట్లు గుర్తించామన్నారు. నిందితులు రాజమహేంద్రవరానికి చెందిన జి.సతీష్‌కుమార్, నరసాపురానికి చెందిన ఎం.నాగభాస్కరరావు, కె.నరేష్‌లపై కేసు నమోదు చేసి వారి నుంచి 30 కాసులు బంగారపు వస్తువులు, 3 కేజీల వెండి, ఒక మోటర్ వెహికల్ స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందన్నారు. పాలకొల్లు పట్టణం, రూరల్, పోడూరు, యలమంచిలి, వీరవాసరం, పాలకోడేరు, నరసాపురం పట్టణం, రూరల్, మొగల్తూరు స్టేషన్ల పరిధిలో 19 చోరీ కేసుల్లో వీరు నిందితులన్నారు. ఇవికాక పలు పోలీస్‌స్టేషన్లలో సతీష్‌పై 32 కేసులు, భాస్కర్‌పై 32 కేసులు, నరేష్‌పై 14 చోరీ కేసులు ఉన్నాయన్నారు. సీఐ దారావత్తు రాంబాబు ఆధ్వర్యంలో చోరీ సొత్తు రికవరీలో ఎస్సైలతో పాటు కానిస్టేబుల్స్ సుబ్రహ్మణ్యం, ఎస్.మణికంత, టి.చింతన్న, యు.రామభద్రం, ఎ.వెంకటకృష్ణ, ఎం.నారాయణరావు, కె.సుబ్రహ్మణ్యంలను డీఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు.

కృష్ణంరాజు స్మారక వైద్య శిబిరాలు కొనసాగిస్తాం



మొగల్తూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్యామలాదేవి, డాక్టర్ వేణు

మొగల్తూరు: యూకే ఇండియా డయాబెటిక్ ఫుట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూవీ కృష్ణంరాజు స్మారక ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తామని ఆయన సతీమణి శ్యామలాదేవి చెప్పారు. శనివారం కృష్ణంరాజు జయంతిని పురస్కరించుకుని మొగల్తూరు అభ్యాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంగ్రీన్ బాధితులకు తమ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. శిబిరంలో రెండు వేల మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొంత మందికి గ్యాంగ్రీన్ వ్యాధి సోకినట్టు గుర్తించి వారిని హైదరాబాద్‌లోని అపోలో, భీమవరంలోని వర్మ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. వైద్యులు వేణు కవర్తపు, వర్మ, విజయరామ్ పాపినేని, శ్రీనివాస శేష బట్టారు, సునీత సాగర్, అమర్‌నాథ్ రెడ్డి, కేవీఎస్ ధన్వంతరీ నాయుడు, వెంకట దీప్తి, జితేంద్ర చైతన్య, నాగరాజు సేవలందించారు.

సుగర్ వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పిస్తాం

కృష్ణంరాజు జయంతిని పురస్కరించుకుని శనివారం మొగల్తూరులో ఆయన సతీమణి శ్యామలాదేవి కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. అనంతరం డాక్టర్ వేణుతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. షుగర్ వ్యాధిలో ప్రమాదకరమైనది గాంగ్రీన్ వ్యాధి అని, ఇది సోకితే పాదాల పగుళ్లు, పుండ్లు ఏర్పడి స్పర్శ కోల్పోతారన్నారు. లండన్‌లో గ్యాంగ్రీన్ వ్యాధి సోకిన వారికి శస్త్రచికత్సలు చేసి నయం చేస్తున్నామన్నారు. శ్యామలాదేవి కోరికపై ఇక్కడ ఉచిత శిబిరాలు ఏర్పాటు చేసి గాంగ్రీన్ వాధి సోకిన వారికి శస్త్రచికిత్సలు చేస్తామని వివరించారు.

తండ్రీకొడుకులపై కత్తితో దాడి

అత్తిలి: తండ్రీ కొడుకులపై కత్తితో దాడి చేసిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వి.రాంబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అత్తిలికి చెందిన ములగాల రత్నారావు భీమవరంలోని ఒక ప్రైవేటు ఎలక్ట్రికల్స్ షోరూంలో పనిచేస్తున్నారు. షోరూంలో ఫర్నిచర్‌ను వాయిదాల పద్ధతిలో ఇప్పిస్తానని నమ్మబలికి వారి నుంచి ఆధార్, పాన్ కార్డులు తీసుకుని వారిపేరుతో షోరూంలో వస్తువులు తీసుకుని అమ్ముకున్నాడు. కొన్నాళ్ల తరువాత వాయిదాలు కట్టాలంటూ షోరూమ్ నుంచి నోటీసులు రావడంతో బాధితులు గొల్లుమన్నారు. ఏడాది క్రితమే ఈ ఘటన వెలుగులోకి రాగా బాధితులంతా రత్నారావుతో పలుమార్లు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మంచిలికి చెందిన బాధితుడు గోడి విష్ణు శుక్రవారం రాత్రి రత్నారావుపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. అడ్డు వచ్చిన తండ్రి రామారావుపై సైతం దాడి చేశాడు. గాయపడ్డ తండ్రీకొడుకులను రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రామారావు భార్య రాధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గుర్తింపు కార్డు అందజేత



మంత్రి రోజా నుంచి కార్డు అందుకుంటున్న కళింగ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దళిత డప్పు కళాకారుల గుర్తింపు కార్డును శనివారం విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో డప్పు కళాకారుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాడేపల్లిగూడెంనకు చెందిన కళింగ లక్ష్మణరావు అందుకున్నారు. మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా ఈ కార్డును తీసుకున్నారు.

ఐటీడీఏలో గ్రూప్-2 పరీక్షలకు ఉచిత శిక్షణ

బుట్టాయగూడెం: గ్రూప్-2 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న గిరిజన యువతీ యువకులకు కేఆర్‌పురం ఐటీడీఏ వైటీసీలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు కోట రామచంద్రపురం ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 నోటిఫికేషన్ ద్వారా 897 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల నియామకానికి ప్రకటన వెలువడిన నేపథ్యంలో పరీక్షలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేయాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా గ్రూప్-2 పరీక్షలకు రిజిస్ట్రేషన్ చేసిన స్లిప్, అలాగే ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, దరఖాస్తు ఫారమ్‌ను వైటీసీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 9490285277 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

సుంకర ఆళ్వారుదాస్ సేవలు అభినందనీయం



మహిళా సభ్యులతో ఆళ్వారుదాస్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సుంకర ఆళ్వారుదాస్ సేవలు అభినందనీయమని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. ఆళ్వారుదాస్ వర్ధంతిని పట్టణంలో శనివారం వాకర్స్ సభ్యులు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్ అధ్యక్షులు దూలం నాగరాజు, కె.నరసింహమూర్తి, కేవీ చలం, రాగిరెడ్డి నాగవర ప్రసాద్, బాకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగేమహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆళ్వారుదాస్ వర్ధంతి నిర్వహించారు. కె.కనక దుర్గ, వెంకటలక్ష్మి, వజ్రమ్మ, ఉదయ్ కుమారి పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతలు వితరణ



అక్షింతల వితరణ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు వితరణ కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. టూ టౌన్‌లో కొబ్బరితోటలో పలు ప్రాంతాలలో ఈ అక్షింతలను భక్తులకు అందజేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, ఐనం బాలకృష్ణ, సీహెచ్ రాంబాబు, రామగాని సత్యనారాయణ, పాండురంగా రావు, మాదాసు సత్యవాణి పాల్గొన్నారు.

నాసిక్ ఉత్సవాల్లో ఉద్యాన విద్యార్థుల ప్రతిభ



యువజనోత్సవాల్లో ప్రతిభచూపిన విద్యార్థిని అభినందిస్తున్న ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: వికసిత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మహరాష్ట్ర నాసిక్‌లో జరిగిన 27వ జాతీయ యువజనోత్సవాల్లో పర్వతారోహణ క్రీడా విభాగంలో ఉద్యానవర్సిటీ విద్యార్థిని కె.పద్మజాహ్నవి ప్రతిభ కనపర్చారు. భారత ప్రభుత్వ సంస్థ నెహ్రూ యువ కేంద్ర ఆర్థిక సహకారంతో ఈ పోటీల్లో పాల్గొని జాహ్నవి ప్రతిభ చూపించింది. శనివారం వర్సిటీలో జరిగిన అభినందన కార్యక్రమంలో వీసీ టి.జానకీరామ్, అసోసియేట్ డీన్ఎం.మాధవి, డీఎస్ఏ సలోమి, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

ఆకట్టుకున్న డ్యాన్స్ షో



డ్యాన్స్ షోలో నాని మాస్టర్ అండ్ టీం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కొబ్బరితోట శ్రీదేవి మహంకాళమ్మ తల్లి 44వ వార్షికోత్సవ జాతర సందర్భంగా ఆరో రోజు శనివారం రాత్రి కొరియోగ్రాఫర్ నాని మాస్టర్ అండ్ టీం ఆధ్వర్యంలో ఢీ డ్యాన్స్ షో నిర్వహించారు. ఈ షో హాజరైన ప్రేక్షకులను అలరించింది. తొలుత ఆలయం వద్ద అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమవరం: రైళ్లలో ప్రయాణించేటప్పుడు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్‌పీఎఫ్ ఏఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీఆదిత్య డిగ్రీ కాలేజ్‌లో రైళ్లల్లో ప్రయాణించేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు, చెడు అలవాట్లకు, అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ వీబీఎస్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ ఎం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్యానికి మార్గదర్శకమని జిల్లా రెవెన్యూ అధికారి శివ నారాయణరెడ్డి అన్నారు. రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఓటు హక్కు వినియోగం ప్రజాస్వామ్య పరిరక్షణ అంశంపై నాచువారి సెంటర్‌లో ర్యాలీ, సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి స్వచ్ఛమైన ఓటు ప్రతిజ్ఞ ఈవీఎంలపై వివరించారు.

● రాహుకేతు పూజలకు విశేష స్పందన

తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ ధర్మాదాయ నిర్వహణలో ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సారథ్యంలో ధర్మ ప్రచార మహోత్సవాల సందర్భంగా శనివారం రాహుకేతు పూజలు నిర్వహించారు. పురదేవత శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పూజల నిమిత్తం ఏర్పాటు చేసి వేదిక వద్ద ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, సౌదామిని దంపతులతోపాటు సుమారు 30 వేల మంది దంపతులు రాహుకేతు పూజలు నిర్వహించారు. శ్రీ కాళహస్తీశ్వరాలయం నుంచి ధర్మ ప్రచార రథం, వేదపండితులు అర్చక స్వాములు తరలివచ్చారు. ఈ పూజలకు అవసరమైన పూజాద్రవ్యాలను శ్రీ



రాహుకేతు పూజలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

కాళహస్తీశ్వరాలయం నుంచి తీసుకువచ్చి పూజలు చేశారు. పూజలు అనంతరం శ్రీ కాళహస్తీశ్వరుడికి ప్రీతికరమైన జిలేబి ప్రసాదాన్ని



రాహుకేతు పూజలకు హాజరైన భక్తులు

వితరణ చేశారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణ పరిసర ప్రాంతాలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సంతోషంగా శాంతియుత జీవనం సాగించాలని ఈ ధార్మిక మహోత్సవాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు



పెంటపాడు: ఫైనల్‌కు చేరిన మండల క్రికెట్ జట్టుకు ప్రాక్టీస్ కోసం క్రీడా సామగ్రిని అందిస్తున్న దృశ్యం



తణుకు: మహిళా కళాశాలలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి విజేతలతో ఎంపీడీవో తదితరులు

పెంటపాడు: మండలంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి ఫైనల్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఫైనల్‌కు అత్యధికంగా కె. పెంటపాడు మహిళా టీంలు ఎంపికయ్యాయి. కబడ్డీ, ఖోఖో, క్రికెట్ టీంలలో కె. పెంటపాడు గ్రామానికి చెందిన మహిళలు ఎంపిక కావడం గమనార్హం. ఈ సందర్భంగా స్థానిక స్కూల్లో శనివారం సాయంత్రం ముగింపు, గెలుపొందిన టీంల అభినందన సమావేశం సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీఓ సీహెచ్ బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణస్థాయినుండి క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా పలు విభాగాలలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఫైనల్‌కు చేరిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ కబడ్డీ క్రీడాకారులకు పట్టీలు అందజేసారు. క్రికెట్ క్రీడాకారులకు ప్రాక్టీస్ కోసం కిట్‌లు ఎంపీడీఓ బాలాజీ, ఎంఈఓ టీవీ రామకృష్ణ అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి నియోజకవర్గ స్థాయిలో ఆడబోయే పోటీల్లో మండల విద్యార్థులు, యువత ప్రతిభ కనపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీలు సత్తి కన్నారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, క్రీడల ఇన్‌చార్జి చంద్రశేఖర్, కృపావరం, యోహాన్, యోగా టీచర్ శ్రీనివాస్, వైశాలి, సాయి హరనాథ్‌రెడ్డి, ఉమామహేశ్వరి, పెంటపాడు గ్రామ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన టీం వివరాలను క్రీడల ఇన్‌చార్జి చంద్రశేఖర్ వివరించారు. బాడ్మింటన్‌లో ప్రత్తిపాడు (మెన్స్), ఆకుతీగపాడు (ఉమన్), వాలీబాల్ లో మీనవిల్లూరు (మెన్స్), ముదునూరు (ఉమన్స్), కబడ్డీలో పెంటపాడు-3(మెన్స్), కె. పెంటపాడు (ఉమన్), ఖోఖోలో పరిమెళ్ల (మెన్స్), కె. పెంటపాడు(ఉమన్స్), క్రికెట్‌లో పెంటపాడు-1(మెన్స్), కె. పెంటపాడు (ఉమన్స్) టీంలు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 26 నుంచి నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించినట్లు ఇన్‌చార్జి చంద్రశేఖర్ వివరించారు.



పెంటపాడు: ఎస్వీబీఎన్‌స్కూల్లో ఉత్కంఠగా సాగుతున్న వాలీబాల్ పోటీలు



తాడేపల్లిగూడెం రూరల్: మాధవరంలో క్రికెట్ పోటీల విజేతకు షీల్డ్ అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

శారీరక శ్రమతోనే ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్: శారీరక శ్రమతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని మాధవరం, పెదతాడేపల్లి గ్రామాల్లో మండల స్థాయి ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మాధవరంలో ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి కనబర్చాలన్నారు. తద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అనంతరం మండల స్థాయిలో నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల విజేతల వివరాలను వెల్లడించారు. పురుషుల వాలీబాల్‌లో కొమ్ముగూడెం సచివాలయం, మహిళల విభాగంలో తాడేపల్లి-1 సచివాలయం, కబడ్డీ (పురుషులు) కడియద్ద సచివాలయం, మహిళలు కుంచనపల్లి సచివాలయం, ఖోఖో (పురుషులు) జగన్నాథపురం-1 సచివాలయం, మహిళల విభాగంలో రామన్నగూడెం సచివాలయం, క్రికెట్ (పురుషులు) కుంచనపల్లి సచివాలయం, మహిళల విభాగంలో తాడేపల్లి-2 సచివాలయం, బ్యాడ్మింటన్ (పురుషులు) కుంచనపల్లి సచివాలయం, మహిళల విభాగంలో కొమ్ముగూడెం సచివాలయం విజేతలుగా నిలిచాయి. ఆయా టీమ్‌లు నియోజకవర్గ స్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.విశ్వనాథ్, ఈఓపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఎంఈవో-1, 2లు వి.హనుమ, పీఎంకే జ్యోతి, పంచాయతీ ఈవోలు ఆర్‌వీ.బ్రహ్మం, కే.శ్రీనివాస రెడ్డి, బి.ఫణికుమార్, నాయకులు జడ్డు హరి బాబు, తమ్మిశెట్టి చుక్కయ్య, పరిమి తులసీదాస్ పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో విజేతలకు అభినందనలు

తణుకు టౌన్: మండల స్థాయిలో విజేతలైన క్రీడాకారులు జిల్లా స్థాయిలో రాణించాలని ఎంపీడీవో కె కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. శనివారం తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి విజేతలకు టీ షర్ట్‌లు, క్యాప్‌లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మండల స్థాయిలో వివిధ సచివాలయ స్థాయిలో విజేతల నుంచి పురుషుల నుంచి 5 జట్లు, మహిళల నుంచి 5 జట్లకు నిర్వహించిన పోటీల్లో క్రికెట్, వాలీబాల్, వంటి ఐదు క్రీడాంశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వారందరినీ ఎంపీడీవో ఇతర పీడీలు అభినందించి వారికి టీ షర్టులు, క్యాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తణుకులో అయోధ్య శ్రీరామ వైభవ యాత్ర

తణుకు అర్బన్: అయోధ్యలో సోమవారం బాల శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్, సీతారామ కల్యాణ ఆహ్వాన సమితి ఆధ్వర్యాన తణుకులో అయోధ్య శ్రీరామ వైభవ యాత్ర, సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తణుకు వేల్పూరు రోడ్డులోని వీ మ్యాక్స్ థియేటర్ ప్రాంతం నుంచి మేళ తాళాలతో కోలాట నృత్యాలు, భక్తజన బృందాల భజనలు, శ్రీరామనామ సంకీర్తనల మధ్య సీతారాముల విగ్రహాలతో భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్టు చెప్పారు. శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్దకు రాష్ట్రపతి రోడ్డు మీదుగా శోభాయాత్ర చేరుకుంటుందని, సాయంత్రం ఆరు గంటలకు కల్యాణ వేదికపై సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పెద్ద శివాలయం శివారు ప్రాంతంలో బీఆర్ కాలనీలో అగ్నిప్రమాద కారణంగా నిరాశ్రయులైన కుటుంబానికి లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో సాయం చేశారు. ఆదివారం ఆ క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామోహన్‌రావు ఆధ్వర్యంలో రీజియన్ చైర్‌పర్సన్ లయన్ మదన్‌మోహన్ అగర్వాల్ చేతుల మీదుగా రూ 10 వేలు ఆర్థిక సహకారం, 26 కేజీల బియ్యం అందించారు. సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, పచ్చా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బలుసులమ్మకు బంగారం సమర్పణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శనివారం బంగారు సూత్రాల నిమిత్తం శ్రీరంగం సత్యనారాయణ, సావిత్రి దంపతులు, కుటుంబ సభ్యులు 25 గ్రాముల బంగారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు దాతలకు సత్కరించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం : పశుగణ శాఖాభివృద్ధి శాఖ ఏటా జనవరి 14 నుంచి 30 వరకు జంతు పరిరక్షణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్టు పశుగణ శాఖాభివృద్ధి ఏడీ సత్యనారాయణ అన్నారు. జిల్లా పశుగణ శాఖాభివృద్ధి శాఖ, జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంతు పరిరక్షణ పక్షోత్సవాల బ్రోచర్‌ను శనివారం విడుదల చేశారు. జిల్లా పశుగణ శాఖాభివృద్ధి శాఖ డైరెక్టర్ గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ఈ పక్షోత్సవాలను జయప్రదం చేయాలని అన్నారు. చెరుకువాడ రంగసాయి, సుంకర దాసు మాట్లాడుతూ ఈ నెల 30 వరకు అవగాహన సదస్సులు, వివిధ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కిల్లీ, బీడీ వర్తక సంఘం అధ్యక్షుడిగా పైబోయిన



పైబోయిన ఏసుబాబు, అధ్యక్షుడు



జయరామ వెంకట సుబ్బారావు, కార్యదర్శి

తణుకు అర్బన్: కిల్లీ, బీడీ, సిగరెట్, సోడా అండ్ కూల్‌డ్రింక్స్ వర్తక సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లుగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బోయిడి అన్నవరం, గమిడి సుబ్బారావు తెలిపారు. శనివారం కార్యాలయ భవనంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లుగా వివరించారు. గౌరవ అధ్యక్షుడిగా బోయిడి అన్నవరం, అధ్యక్షుడిగా పైబోయిన ఏసుబాబు, కార్యదర్శిగా గమిడి జయరామ వెంకట సుబ్బారావు, కోశాధికారిగా కొమ్మన రాంబాబు, ఉపాధ్యక్షుడిగా పెదిరెడ్ల ఈశ్వరరావు, చుండూరి సత్యనారాయణమూర్తి, సహాయ కార్యదర్శులుగా శిరాలం శ్రీనివాసు, సుంకర వెంకటేశ్వరరావు, ముఖ్య సలహాదారులుగా గుమ్మళ్ల హనుమంతరావు, కాసా పద్మనాభం, గంధం రామకృష్ణ, మల్లిపూడి రామారావు, యిందుకూరి నాగరాజు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక బీసీ కమ్యూనిటీహాలు ప్రాంతంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్టు వివరించారు.

సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఎలుకల నిర్మూలన కార్యక్రమం రైతులంతా సామూహికంగా చేపడితేనే ప్రయోజనం ఉంటుందని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్యామ్ రాజ్ నాయక్ అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా శనివారం మండలంలోని వీరంపాలెం గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ రాజ్‌నాయక్ మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూనల ద్వారా ఎలుకల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. అనంతరం ఎలుకల నివారణ ఎరను తయారు చేసే విధానాన్ని డాక్టర్ వసంత భాను విద్యార్థులకు, రైతులకు వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్‌అధికారులు డాక్టర్ అమ్మాజీ, డాక్టర్ జి.రమేష్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



వీరంపాలెంలో సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆక్వా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్ను



గాదిరాజు వెంకటసుబ్బరాజు

భీమవరం: ఆక్వా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉందని ఆక్వారైతుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదిరాజు వెంకటసుబ్బరాజు అన్నారు. శనివారం భీమవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అప్సడా చట్టం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ దృష్టికి ఆక్వా సమాఖ్య అనేక సమస్యలు తీసుకువెళ్లడంతో ఫీడ్ ధరలు తగ్గించడంలో, నాణ్యమైన సీడ్ సరఫరా చేయడానికి సీడ్ హేచరీ యజమానులు, ఫీడ్ కంపెనీలతో మాట్లాడి రైతులకు మేలు చేకూర్చారని గుర్తుచేశారు. రొయ్యల కొనుగోలుదారులతో మాట్లాడం ద్వారా ధరలు మరింత తగ్గిపోకుండా చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. విద్యుత్ సబ్సిడీ విషయంలో 10 ఎకరాల్లోపు రైతులందరికీ ప్రభుత్వం ప్రయోజనం చేకూర్చిందని తెలిపారు. కొత్తగా విద్యుత్ కనెక్షన్స్ తీసుకున్న రైతులకు కూడా సబ్సిడీ వర్తించే విధంగా రఘురామ్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఆక్వా రంగ ప్రధాన కార్యాలయాలు భీమవరంలో ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం అంగీకరించదని, ప్రభుత్వం అన్నిరకాలుగా ఆక్వా రైతులకు మేలు చేస్తున్న తరుణంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆక్వా సమాఖ్య మరింత ముందుకెళుతోందని చెప్పారు. సమస్యలన్నీ ఏకకాలం పరిష్కారమ్యే అవకాశం లేనందున రైతులు కూడా సానుకూలంగా ఆలోచించాలని సుబ్బరాజు కోరారు.

ధ్యానరత్న సాంబశివరావుకు డాక్టరేట్

ఆకివీడు: ధ్యానం, ఆధ్యాత్మిక శాస్త్రాన్ని రెండున్నర దశాబ్దాలుగా బోధిస్తున్న ధాన్యరత్న ఉంద్రమట్ల సాంబశివరావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. విజయవాడలో యూనైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసిందని సాంబశివరావు తెలిపారు. ఆధ్యాత్మిక శాస్త్రవేత్త (స్పిర్చువల్ సైన్సు)లో తాను డాక్టరేట్ అందుకున్నట్టు చెప్పారు. ఆయన్ని స్పిర్చువల్ సొసైటీ జిల్లా కార్యదర్శి పీబీ ప్రతాప్‌కుమార్, ఎంవీ సూర్యనారాయణరాజు, యోగాసనాచార్యులు కందుల సత్యనారాయణ, కుంకట్ల సత్యనారాయణ, డీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా భీమవరం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): అభివృద్ధిలో భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో నిర్మించిన పలు రోడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. 34వ వార్డులో రూ.20.50 లక్షలతో సీత టవర్స్ నుంచి గోపీకృష్ణ టవర్ వరకు, ఎస్ఆర్‌కేఆర్ రోడ్డు నుంచి ఏఎస్ఆర్ కల్యాణ మండపం వరకు నిర్మించిన బీటీ రోడ్డును, 35వ వార్డులో రూ.19.50 లక్షలతో ఆదర్శనగర్ రెండో వీధి నుంచి వంశీకృష్ణ నగర్‌లోని కాస్మో క్లబ్ వెనుక వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. 35వ వార్డులో రూ.29.50 లక్షల నిధులతో ఉండి రోడ్డు నుంచి వీఎస్ఎస్ గార్డెన్స్ వరకు నిర్మించిన బీటీ రోడ్డును, 36వ వార్డులో రూ.10.50 లక్షలతో సత్యవతి నగర్ టౌన్ స్టేషన్ కాంపౌండ్ వాల్ నుంచి ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును, 37వ వార్డులో రూ.23.50 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగున్నర ఏళ్లుగా భీమవరం పట్టణాన్ని, నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 15 వేల మందికి పైనే ఇళ్ల స్థల పట్టాలను అందించామన్నారు. భీమవరం పట్టణంలో ఇప్పటి వరకు దాదాపుగా రూ.100 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేశామన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను భీమవరంలో 100 పడకల ఆసుపత్రి కోసం ప్రతిపాదనలు చేశానని, నేడు ఆయన తనయుడు సీఎం జగన్ ఆధ్వర్యంలో నాలుగు ఎకరాల్లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని తెలిపారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరు చేయించామని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కంపోస్ట్ యార్డుకు ఆరున్నర ఎకరాల భూ సేకరణతోపాటు అక్కడికి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికీ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, గాది రాజు సుబ్రహ్మణ్యరాజు, ఏఎస్ రాజు, నడింపల్లి అప్పలరాజు, చిలుకూరి బోసురాజు, గొట్టుముక్కల రామకష్ణంరాజు, సీతారామరాజు, చెన్ను చంటి, కొప్పర్తి వీర రాఘవులు, రేవూరి గోగిరాజు, పత్తి నరసింహారావు, దంతులూరి లక్ష్మీపతి రాజు, నాగ దుర్గ, చిన్నమిల్లి వెంకటరాయుడు తిరుమాని రాము, మండలి నరేంద్ర, చింతలపాటి సుబ్రమణ్య రాజు, ముదునూరి స్వాతిసుబ్బరాజు, అడపా బాబ్జి, గొట్టు ముక్కల సుబ్బరాజు, పూజారి రంగ పాల్గొన్నారు.



35వ వార్డులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

ఆకట్టుకున్న అల్లూరి సీతారామరాజు నాటకం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మవారి 60వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవారి దేవస్థానం వద్ద ప్రదర్శించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. శ్రీమావుళ్లమ్మ, సూర్యోదయ ఆర్ట్స్ భీమవరం వారిచే పులగం శివనాగ నర్సింహరావు ఆధ్వర్యంలో ఈ నాటకం ప్రదర్శించారు. తొలుత కోలాటం, భక్తి పాటలు, సినీ మ్యూజికల్ నైట్, భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ, దేవస్థానం, సిబ్బంది ధర్మకర్తలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

భీమవరం: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మూడో అదనపు న్యాయమూర్తి పి.శ్రీ సత్యాదేవి అన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై శనివారం భీమవరం కోర్టు సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీసత్యాదేవి మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన కలిగి ఉండాలన్నారు. హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నపుడే ఆత్మస్థైర్యం, సమస్యను ఎదుర్కొగలమన్న ధీమా ఉంటుందని చెప్పారు. జిల్లాలో మహిళలు, బాలికల హక్కులపై ఐసీడీఎస్ శాఖ, అనేక సంస్థలు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. నిందితుడిపై తీసుకున్న చర్యలు మీడియా ద్వారా ప్రచారం చేసినప్పుడే వారికి భయం ఉంటుందని అన్నారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పడే శిక్షలు, టోల్ ఫ్రీ నెంబరు బోర్డులు ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, ఎ.పవన్ కుమార్, జి.సురేష్ బాబు, డి.ధనరాజు పాల్గొన్నారు.